217) శంకరాభరణం

ప॥ కలది యీమూర్తివల్ల గతి గనవలెను। యిల నిందు నమ్మకుంటే యెందు మరి లేదు॥

చ॥ కంటిమా బ్రహ్మమును వేంకటపతి గనినట్టు। కంటిమా అవతారాలు కతలేకాక।
కంటిమా హృదయములో గలిగినదైవమును। కంటిమా వైకుంఠము కడవారైనాను॥

చ॥ తెలిసీనా జ్ఞానము యీదేవునిమహిమవలె। తెలిసీనా వేదాలు సందేహమేకాక।
తెలిసీనా మాయ యిది యెంత చదివినా। తెలిసీనా ముందరితెరువు వెదకితే॥

చ॥ చిక్కీనా మనసు యీశ్రీవేంకటేశ్వరునివలె। చిక్కీనా ధ్యానము వట్టిచింతలేకాక।
చిక్కీనా అనాదినుండి చిగిరించీకాలము। చిక్కీనా పెద్దలు చెప్పేజితమైనశాంతి॥